అంజన్నను దర్శించుకోకుండానే

మృత్యుఒడికి

- ఎన్టీపీసీ నుంచి కొండగట్టుకు బయలు దేరిన భక్తుడు
- దాదాపు 45 కిలోమీటర్లు కాలినడక
- ఎండదెబ్బతో రాజారాంపల్లి సమీపంలో అస్వస్థత
- ఖని దవాఖానకు తీసుకొచ్చేలోపే మృతి
- దుఃఖంలోనూ కుటుంబసభ్యుల ఔదార్యం
- కొడుకు కిశోర్ నేత్రాల దానం

ఈదునూరి కిశోర్ (ఫైల్)

జ్యోతినగర్, జూన్ 1: కొండగట్టు అంజన్న దర్శనం కోసం కాలినడకన బయలుదేరిన ఆ భక్తుడు అనుకోని రీతిలో మృత్యుఒడికి చేరాడు. అంజన్నను దర్శించుకోకుండానే మార్గమధ్యంలో ఎండదెబ్బతో ప్రాణాలు విడిచాడు. ఈ దుఃఖంలోనూ కుటుంబ సభ్యులు ఔదార్యం చాటారు. తమ కొడుకు నేత్రాలను దానం చేశారు. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన ఈదునూరి ఉమ్మయ్య, శంకరమ్మ దంపతుల కొడుకు కిశోర్ (37) ఎన్టీపీసీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం హనుమాన్ పెద్ద జయంతి ఉండగా, కొండగట్టు అంజన్నను దర్శించుకోవాలని అనుకున్నాడు. గురువారం సాయంత్రం 5గంటలకు పది మంది దీక్షాపరులతో కలిసి కాలినడకన బయలుదేరాడు. గురు, శుక్రవారాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 46డిగీల వరకు నమోదు కావడం, ఎండ దంచికొట్టడంతో మార్గమధ్యలో విశ్రాంతి తీసుకుంటూ శుక్రవారం మధ్యాహం వరకు 45 కిలోమీటర్లు నడిచాడు. ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామ సమీపానికి చేరుకున్నాడు. 3గంటల సమయంలో భోజనం చేశాడు. అదే సమయంలో తీవ్ర అస్వస్థత చెంది వాంతులు చేసుకున్నాడు. వెంటనే ఈ సమాచారాన్ని దీక్షాపరులు కుటుంబసభ్యులకు అందించారు. వారి సూచన మేరకు గోదావరిఖనిలో జీజీహెచ్ దవాఖానకు తీసుకొచ్చారు. అయితే అప్పటికే కిశోర్ చనిపోయాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించారు. అప్పటికే రాత్రి కావడంతో శనివారం అంత్యక్రియలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. కిశోర్ దగ్గరి బంధువైన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ ఉదయం వచ్చి నేత్రదానంపై తల్లిదండ్రులు, సోదరులకు అవగాహన కల్పించారు. దాంతో వారు ఔదార్యం చాటారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ నరేందర్ సహకారంతో ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు, ప్రధానకార్యదర్శి లింగమూర్తి, పట్టణ కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్, ప్రతినిధి అనుమాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. కిశోర్ మృతదేహానికి రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో పాటు కొంకటి లక్ష్మీనారాయణ నివాళులర్పించారు. వారి వెంట ఇక్కడ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు కౌశికహరి, తదితరులు ఉన్నారు.

వానకాలం ప్రణాళిక సిద్ధం

- పంటల విస్తీర్ణంపై అధికారుల అంచనా
- ప్రధానంగా వరి, తర్వాత పత్తి, మక్కజొన్న
- సరిపడా విత్తనాలు, ఎరువులు ఎంత అవసరమో గుర్తించిన యంత్రాంగం

వాన కాలం సాగు ప్రణాళికను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేశారు. జూన్ నెల నుంచి అమలులోకి వచ్చే సీజన్‌లో సాగయ్యే పంటల విస్తీర్ణాన్ని అంచనా వేశారు. ఇందుకు సరిపడా విత్తనాలు, ఎరువుల అవసరాన్ని కూడా గుర్తించారు. ప్రధానంగా వరినే ఈసారి ఎక్కువగా సాగు చేస్తారని ఎప్పటిలాగే అంచనా వేశారు. పత్తి, మక్కజొన్న పంటలు ఆ తర్వాత స్థానంలో ఉండనున్నాయి. వర్షాలు అనుకూలిస్తే జూన్ రెండో వారం నుంచే వానకాలం సీజన్ ప్రారంభం కానుండగా, రైతులు కూడా అందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కరీంనగర్ జిల్లా

కరీంనగర్, జూన్ 1(నమస్తే తెలంగాణ): ఈసారి వానకాలంలో 3,48,070 ఎకరాల్లో పంటలు చేస్తారని, అందులో 2,74,500 ఎకరాల్లో వరి, 4,500 ఎకరాల్లో మక్క, 48 వేల ఎకరాల్లో పత్తి వేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక కందులు 2 వేలు, పెసర 550, మినుము 15, ఉలువలు 25, ఇతర పప్పు దినుసులు 15, పల్లి 200, నువ్వులు 5, ఆముదం 5, ఎండు మిర్చి 1,000, పసుపు 50, ఇతర పంటలు మరో 14,090 ఎకరాల్లో సాగవుతాయని భావిస్తున్నారు. కాగా, గత సీజన్ కంటే ఈసారి 5,151 ఎకరాల్లో పంటల సాగు పెరిగే అవకాశముందని అధికారుల అంచనాలను బట్టి తెలుస్తున్నది. వరిలో స్వల్పంగా 24 ఎకరాలు మాత్రమే పెరుగనున్నట్టు అంచనా వేశారు. ఇక మక్క నిరుడి కంటే ఈసారి 1,363, పత్తి 2,125, కందులు 1,065, పెసర 507 ఎకరాల్లో పెరిగే అవకాశమున్నది. కాగా, సాగు అంచనాలను బట్టి వరి విత్తనాలు 68,625 క్వింటాళ్లు, కందులు 60, మక్క 360, మిర్చి 1, పెసర 44, మినుములు 1.20, పల్లి 120, ఆముదం 0.10, నువ్వులు 0.13 క్వింటాళ్లు అవసరం ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. అలాగే, పత్తి విత్తన ప్యాకెట్లు 1.20 లక్షల వరకు అవసరం ఉంటాయని, పచ్చి రొట్ట కింద సాగు చేసే జీలుగ 6,800, జనుము 200 క్వింటాళ్ల చొప్పున అవసరం ఉంటాయి. ఈ సీజన్‌లో ఎరువులు 78,110 టన్నులు అవసరం ఉంటాయని అధికారులు అంచనా వేశారు. ఏప్రిల్ 24 నుంచి సెప్టెంబర్ 24 వరకు ఏ నెలలో ఎన్ని ఎరువులు అవసరం ఉంటాయనేది అధికారులు స్పష్టమైన అంచనా వేశారు. మొత్తంగా యూరియా 44,358, డీఏపీ 6,559, ఎన్‌పీకే 20,765, ఎంఓపీ 6,433 క్వింటాళ్లు అవసరం ఉంటాయని అంచనా వేశారు.

రాజన్న సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల, జూన్ 1(నమస్తే తెలంగాణ): జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పంటల విస్తీర్ణం అంచనా 2,35,866 ఎకరాలు కాగా, అత్యధికంగా 1,83,080 ఎకరాల్లో వరి సాగుకు అధికారులు అంచనా వేశారు. రెండో స్థానంలో పత్తి 49,215 ఎకరాలు, కందులు 1502, మొక్కజొన్న 1510, సోయాచిక్కుడు 5, ఎండు మిర్చి 180, పెసర 348, మినుములు 10, జొన్నలు 10, ఆముదం 6 ఎకరాల్లో సాగుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు కావాల్సిన విత్తనాలను అందుబాటులో ఉంచారు. వరి విత్తనాలు 45,770 క్వింటాళ్లు, కందులు 45.06 క్వింటాళ్లు, మక్కజొన్న 120.80 క్వింటాళ్లు, పత్తి 665 క్వింటాళ్లు, సోయాచిక్కుడు 1.50 క్వింటాళ్లు, ఎండు మిర్చి 0.80 క్వింటాళ్లు, జొన్నలు 0.40 క్వింటాళ్లు, ఆముదం 0.12 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎరువుల కోసం ఇండెంట్‌ను ప్రభుత్వానికి పంపించారు. సన్న వడ్లను సాగు చేసేందుకు వ్యవసాయ శాఖ అధిక ప్రాధాన్యతనిస్తున్నది.

జగిత్యాల జిల్లా

జగిత్యాల టౌన్, జూన్ 1: జిల్లాలో వానకాలం సీజన్‌లో 4,34,425 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయ నున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇందులో అత్యధికంగా వరి 3,05,000 ఎకరాలు, మక్కజొన్న 41,000, కందులు 2500, పెసర్లు 150, సోయా 600, పత్తి 20,200, చెరుకు 1200, పసుపు 11,000, అలిశెంత, అనుములు 675, ఇతర పంటలు 42,100 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం విత్తనాల అవసరాన్ని గుర్తించారు. వరి విత్తనాలు 76,250 క్వింటాళ్లు, మక్కజొన్న 3,280 క్వింటాళ్లు, కందులు 75 క్వింటాళ్లు, పెసర్లు 12 క్వింటాళ్లు, సోయాబిన్ 180 క్వింటాళ్ళు, పత్తి 40,200 ప్యాకెట్లు అవసరం ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఎరువుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. జూన్ నెలలో యూరియా 36,650 మెట్రిక్ టన్నులు, డీఏపీ 11,747, ఎస్ఎస్‌పీ 4,780, ఎంవోపీ 10,300, కాంప్లెక్స్ 46,100 మెట్రిక్ టన్నులు అవసరం ఉన్నట్లు తెలిపారు.

పెద్దపల్లి జిల్లా

పెద్దపల్లి, జూన్ 1(నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ఒక అర్బన్, 13 రూరల్ మండలాల్లో అన్నిరకాల పంటలు 2,77,723 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో వరి అత్యధికంగా 2,08,814 ఎకరాలు, పత్తి 57,269 ఎకరా లు, మక్కజొన్న 780 ఎకరాలు, పెసలు 16 ఎకరాలు, కంది 158 ఎకరాలు, ఉద్యానవన పంటలు 10,686 ఎకరాల్లో పండిస్తారని ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలోని మండలాల వారీగా వ్యవసాయ అధికారులు పచ్చిరొట్ట విత్తనాలను కేటాయించారు. ఎరువులు డీఏపీ, యూరియా, పొటాష్ 24,384 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు 32,082 మెట్రిక్ టన్నుల యూరియా, 8,280 మెట్రిక్ టన్నుల డీఏపీ, 24,579 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 6,889 మెట్రిక్ టన్నుల పొటాష్ కోసం అధికారులు ఇండెంట్ పెట్టారు. కాగా, గతం కంటే ఇప్పుడు పత్తి సాగు పెరిగే అవకాశం ఉందని, రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేయకుండా అన్ని రకాల చర్యలు చేపట్టామని జిల్లా వ్యవసాయ అధికారి దోమ ఆదిరెడ్డి తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

గంజాయి.. వయా తెలంగాణ

- ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలింపు
- కరీంనగర్ శివారులో పట్టివేత
- 70 కిలోల ప్యాకెట్లు స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్ట్

రాంనగర్, జూన్ 1 : ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేసి తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్న ఆంధ్రా వ్యాపారులను కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు.. శనివారం కరీంనగర్ శివారులోని తీగల బ్రిడ్జి చౌరస్తా వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానస్పదంగా వచ్చిన కారును అదుపులోకి తీసుకున్నారు. అందులో ఉన్న ముగ్గురిని ప్రశ్నించగా.. పొంతన లేని సమాధానం చెప్పడంతో కారును క్షుణ్నంగా పరిశీలించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన కారు నంబర్‌తో గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించి, 70 కిలోల ఎండు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో విశాఖ జిల్లా కొమ్మాదికి చెందిన రామకృష్ణ, కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన మణికంఠ, మహారాష్ట్రలోని పబ్బని జిల్లా భీంనగర్‌కు చెందిన ధర్మేంద్రకుమార్ అలియాస్ సల్మాన్ అన్నారిగా గుర్తించారు. తనిఖీలు చేసినా గుర్తించకుండా కారు వెనుక సీటు భాగంలో ప్రత్యేకంగా డోర్ ఏర్పాటు చేసి గంజాయిని అందులో తరలిస్తున్నట్లు గుర్తించారు. కారు ఆంధ్రప్రదేశ్‌కు చెందినదే అయినా మధ్యప్రదేశ్ నంబర్ వేసి తరలిస్తున్నారని టౌన్ ఏసీపీ నరేందర్ తెలిపారు. ముగ్గురు నిందితులపై ఎన్‌పీడీపీఏ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయిని పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ సరిలాల్, ఎస్ఐ స్వామిని ఏసీపీ అభినందించారు.

కళ్యాణమస్తు

..మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో

రెడ్డి వధూవరులకు ప్రత్యేకంగా చూడబడును మరియు అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి:
16 Year's Experience
Dr. Smt. Konala Bhagyalakshmi Reddy, Astrologer,
Ex:Telangana Marriage Bureau Association.
H.O.: షాప్ నెం.48, HMDA కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్
B.O.: Opposite Sai Baba Temple, Dilsukhnagar,
Whatsapp: 9866044439

వధువు కావలెను

★రెడ్డి:28 Yrs, 5'10", B.Tech., MS, SWE, USA, 150 K P/A, 60 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9030315599

★రెడ్డి:26 Yrs, 6 Ft, MBBS, MD, Doctor, Well Settled గల వరుడికి తగిన వధువు కావలెను. 9246960888

★కాపు:27 Yrs, 5'10", MBA, SWE, Hyd, 17 Lakhs P/A, 30 Cr. ప్రాపర్టీ గల వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★విశ్వబ్రాహ్మిణ్:28 Yrs, 5'11", MBA, Team Leader, Hyd, 16 Lakhs P/A గల వరునికి తగిన వధువు కావలెను. 7207930999

★గౌడ: 28 Yrs, 5'10", B.Tech, SWE, Hyd, 14 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9246960888

★ముదిరాజ్:27 Yrs, 5'8" B.Tech, SWE, Hyd, 90,000/- PM గల వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★హిందూ-మాల:28 Yrs, 5'8", B.Tech, SWE, Hyd, 14 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 7207930999

★హిందూ-మాదిగ:28 Yrs, 5'9", B.Tech., SWE, Hyd, 60,000/- PM గల వరుడికి తగిన వధువు కావలెను. 9248064777

★రజక CASTE NO BAR: 29 Yrs, B.Tech, SWE, Hyd, 24 Lakhs P/A, 40 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9030315599

★రెండవ (పెళ్ళి)CASTE NO BAR: 36 Yrs, 5'9", B.Sc., SWE, Hyd, 40 Lakhs P/A గల వరునికి తగిన వధువు కావలెను. 9030315599

వరుడు కావలెను

★రెడ్డి:26 Yrs, 5'4", B.Tech, MS, (USA), SWE, USA, 130 K P/A, Well Settled గల వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599

★రెడ్డి:25 Yrs, 5'5", M.Tech., SWE, 8 Lakhs P/A, Well Settled గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888

★కాపు:26 Yrs, 5'5", B.Tech, SWE, Hyd, 50,000/-PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777

★విశ్వబ్రాహ్మిణ్:26 Yrs, 5'4", B.Tech., M.S, USA, SWE, USA, 100K P/A గల వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999

★బ్రాహ్మిణ్స్:24 Yrs, 5'6", B.Tech, SWE, Bangalore, 21 Lakhs P/A, Well Settled గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888

★ముదిరాజ్: 26 Yrs, 5'5", B.Tech., SWE, Hyd, 40,000/- PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777

★హిందూ-మాల: 29 Yrs, 5'4", B.Tech, MS, USA, SWE, USA, 100K P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 7207930999

★హిందూ-మాల: 27 Yrs, 5'4", B.Tech., SWE, Hyd, 12 Lakhs P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9246960888

★CASTE NO BAR:27 Yrs, 5'4", B.Tech, MS, USA, SWE, USA, 30 Cr. ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599

★యాదవ-CASTE NO BAR (రెండవ పెళ్ళి): 36 Yrs, 5'4", B.Tech., SWE, Hyd, 24 Lakhs P/A, Well Settled గల వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599

వధువు కావలెను

★డైరెక్టు: కోమట్ల అమ్మాయి కావలెను: 1, 2 కొమట్ల అబ్బాయి 36, MSc., MEd ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం, M9HB, మునుగోడు రోడ్ నల్లగొండకు వ్రాయండి. 9121325068.

4 లైన్ల ప్రకటనకు 500/- (+ GST అదనం)
ప్రతి అదనపు లైనుకు 125/-
9848077857



ముక్కుతో టైపింగ్‌లో గిన్నిస్ రికార్డు

25.66 సెకండ్లలోనే ఆల్ఫాబెట్స్ టైప్ చేసిన వినోద్ కుమార్

న్యూఢిల్లీ, జూన్ 1: టైపింగ్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన వినోద్ కుమార్ చౌదరి (44) మరో సరికొత్త రికార్డు సృష్టించారు. కేవలం 25.66 సెకన్లలోనే ఇంగ్లిష్ ఆల్ఫాబెట్స్‌ను ముక్కుతో టైప్ చేసి గిన్నిస్ రికార్డు నెలకొల్పారు. 2023లో తాను సాధించిన రికార్డును తాజాగా తానే బద్ధలు కొట్టారు.

చేతికి ఆరో వేలు!

లండన్, జూన్ 1: ఆరో వేలితో మన సామర్థ్యం మెరుగుపడుతుందా అని ఆలోచించిన శాస్త్రవేత్తలు రోబోటిక్ వేలు అమర్చి చూడగా ఆశ్చర్యకర ఫలితాలు వచ్చాయి. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలోని శాస్త్రవేత్తలు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ అధ్యయనంలో ఆరోవేలు నిజంగా మన సామర్థ్యాన్ని పెంచడంలో సహాయపడుతుందని కనుగొన్నారు.

దక్షిణాఫ్రికాలో అధికార ఏఎన్‌సీకి షాక్

- పార్లమెంట్ ఎన్నికల్లో ఎదురుదెబ్బ
- 30 ఏండ్ల తర్వాత మెజార్టీ కోల్పోయిన పార్టీ

జొహన్నెస్‌బర్గ్, జూన్ 1: దక్షిణాఫ్రికా పార్లమెంట్ ఎన్నికల్లో అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) పార్టీకి గట్టి దెబ్బ తగిలింది. తెల్లవారి వర్ణవివక్ష నుంచి దేశాన్ని విముక్తి చేసిన ఆ పార్టీకి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు చెప్పారు. శనివారం విడుదలైన చారిత్రక ఎన్నికల ఫలితాల్లో ఆ పార్టీ అధికారాన్ని కోల్పోయింది. తెల్లవారి పాలన అంతం చేసి అధికారం చేపట్టిన 30 ఏండ్ల అప్రతిహత ఏఎన్‌సీ పాలనకు ఆ దేశ ప్రజలు వీడ్కోలు పలుకుతూ విభిన్నమైన పాఠం చెప్పారు. బుధవారం జరిగిన ఎన్నికల కౌంటింగ్‌లో మొత్తం 99 శాతం ఓట్ల లెక్కింపు పూర్తవ్వగా అధ్యక్షుడు రాంఫోసా నేతృత్వంలోని అధికార ఏఎన్‌సీకి కేవలం 40 శాతం ఓట్లు మాత్రమే దక్కాయి. ప్రధాన ప్రతిపక్షం డెమోక్రాటిక్ అలయెన్స్ 21 శాతం, ఏఎన్‌సీ నుంచి విభేదించి బయటకు వచ్చిన మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమాకు చెందిక ఎంకే పార్టీకి 14 శాతం ఓట్లు, ద ఎకనమిక్ ఫ్రీడమ్ ఫైటర్స్‌కు 9 శాతం వచ్చాయి. విపక్షాలకు చెందిన 50 పార్టీలు ఈ ఎన్నికల్లో పోటీపడ్డాయి.

1994లో నెల్సన్ మండేలా నేతృత్వంలో అధికారం చేపట్టిన తర్వాత ఆ పార్టీ ఎన్నికల్లో ఓటమి చవిచూడటం ఇదో తొలిసారి. దేశంలో నెలకొన్న అసమానత, పేదరికం, విద్యుత్ సమస్య, నీటి సమస్య, విస్తృత స్థాయిలో నిరుద్యోగం, విచ్చలవిడిగా అవినీతి పెరగడానికి కారణమైన ఏఎన్‌సీకి బుద్ధి చెప్పేలా ప్రజలు సరైన తీర్పు చెప్పారని విపక్షాలు పేర్కొన్నాయి. ఈ ఎన్నికల్లో ఏఎన్‌సీ ఓడినా ఒక విధంగా పార్లమెంట్‌లో ఆ పార్టీయే పెద్దది. అయితే ఇతర పార్టీలతో కలిసి సంకీర్ణం ఏర్పరుచుకుంటే ప్రస్తుత అధ్యక్షుడు సిరిల్ రాంఫోసా అధ్యక్షుడిగా ఎన్నికయ్యే అవకాశం ఉంది. పార్లమెంట్ ఎన్నికలైన 14 రోజుల్లోగా అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సి ఉంది.


రాంఫోసా

కేరళను ముంచెత్తిన వానలు

- మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్
- విరిగిపడ్డ కొండ చరియలు, నీట మునిగిన పొలాలు

తిరువనంతపురం, జూన్ 1: నైరుతి రుతుపవనాల ప్రభావంతో కేరళలో కుండపోత వానలు కురుస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో పలు చోట్ల కొండ చరియలు విరిగి పడ్డాయి. పంట పొలాలు నీట మునిగాయి. మధ్య, దక్షిణ జిల్లాల్లో వర్షాలు తీవ్ర ప్రభావం చూపాయి. కొన్ని గంటల పాటు నిరంతరాయ వర్షం వల్ల కొన్ని చోట్ల ఇండ్లు, వాహనాలు, స్థానిక రహదారులు దెబ్బ తిన్నాయి. నలుగురి చనిపోయినట్టు వార్తలు వచ్చాయి. భారత వాతావరణ విభాగం శనివారం త్రిస్సూర్, మలప్పురం, కోజికోడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇడుక్కి, పాలక్కాడ్, వయనాడ్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, మరో ఆరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మరో వారం రోజుల పాటు రాష్ట్రంలో వర్షాల ప్రభావం ఉండొచ్చని తెలిపింది. ఇడుక్కి జిల్లాలోని మలంకార ఆనకట్టలో అయిదు షట్టర్లను ఎత్తివేశారు. రెమాల్ తుఫాను కారణంగా నైరుతి రుతు పవనాలు కాస్త ముందుగానే కేరళను తాకాయని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

హమాస్‌ను అంతమొందించే వరకు యుద్ధం ఆగదు

- ఇజ్రాయెల్ ప్రధాని పునరుద్ఘాటన

జెరూసలేం, జూన్ 1: హమాస్‌ను తుదముట్టించేవరకు యుద్ధాన్ని ఆపబోమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మరోసారి స్పష్టం చేశారు. గాజాలో శాంతికి తాము సిద్ధమేనని ఇజ్రాయెల్ పేర్కొన్నట్టు అమెరికా ప్రకటించిన నేపథ్యంలో నెతన్యాహూ చేసిన ప్రకటన అయోమయంలోకి నెట్టింది. గాజాపై తాము కొనసాగిస్తున్న యుద్ధం హమాస్ అంతమయ్యే వరకు, వారి పరిపాలన, యుద్ధ సామర్థ్యాలను నిర్వీర్యం చేసే వరకు కొనసాగుతుందని నెతన్యాహూ తేల్చిచెప్పారు.

మిషెల్ ఒబామాకు మాతృవియోగం

వాషింగ్టన్, జూన్ 1: అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇంట విషాదం నెలకొన్నది. మాజీ ప్రథమ మహిళ, ఒబామా భార్య మిషెల్ తల్లి మరియన్ రాబిన్సన్ (86) శుక్రవారం కన్నుమూశారు. ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో (2009-17) మరియన్ రాబిన్సన్ శ్వేతసౌధంలోనే ఉన్నారు. ఒబామా ఇద్దరు పిల్లలు మాలియా, సాషా ఆమె సంరక్షణలోనే పెరిగారు.

సునీతా విలియమ్స్ రోదసి యాత్ర మళ్లీ వాయిదా

కేప్ కెనావెరాల్, జూన్ 1: భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ మూడో రోదసి యాత్ర చివరి నిమిషంలో వాయిదా పడింది. లీకేజ్‌లు, రిపేర్ల కారణంగా గతంలోనూ రెండు మార్లు ఈ ప్రయోగం వాయిదా పడిన విషయం తెలిసిందే. శనివారం రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధం కాగా, కౌంట్ డౌన్ 3 నిమిషాల 50 సెకన్ల వద్ద హఠాత్తుగా నిలిచిపోయింది. బోయింగ్ చేపడుతున్న తొలి ఆస్ట్రోనాట్ ఫ్లైట్ ఇది. దీని ద్వారా సునీతా విలియమ్స్‌తోపాటు బారీ విలిమోర్ (61)ను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపేందుకు నాసా ఈ ప్రయోగాన్ని చేపట్టింది.

పీవోకే విదేశీ భూభాగమే

- మా అధికార పరిధిలోకి రాదు
- కోర్టులో ఒప్పుకున్న పాకిస్థాన్

ఇస్లామాబాద్, జూన్ 1: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) విదేశీ భూభాగమని పాకిస్థాన్ ఒప్పుకున్నది. పీవోకే తమ అధికార పరిధిలోకి రాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇస్లామాబాద్ హైకోర్టుకు వెల్లడించింది. మే 15న కశ్మీరీ కవి, జర్నలిస్ట్ అహ్మద్ ఫర్హాద్ షాను పాకిస్థాన్ ఇంటిలెజెన్స్ సంస్థలు రావల్సిండిలోని తన ఇంటి నుంచి కిడ్నాప్ చేశాయి. ఆయన పీవోకే ప్రజల హక్కుల పరిరక్షణకు, పాక్ మిలిటరికి వ్యతిరేకంగా పోరాడుతుంటారు. దీంతో తన భర్త ఆచూకీని తెలపాలని కోరుతూ ఆయన భార్య ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ మొహ్సిన్ అఖ్తర్ కయానీ.. ఫర్హాద్ షాను కోర్టులో హాజరుపరచాల్సిందిగా ఆదేశించారు. అయితే, ఫర్హాద్ ప్రస్తుతం పీవోకేలో పోలీస్ కస్టడీలో ఉన్నాడని, కాబట్టి అతడిని ఇస్లామాబాద్ హైకోర్టులో తాము ప్రవేశపెట్టలేమని శుక్రవారం పాకిస్థాన్ అడిషనల్ అటార్నీ జనరల్.. కోర్టుకు తెలియజేశారు. కశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగం, సొంత కోర్టులు ఉన్నాయని, పాకిస్థాన్ కోర్టులు ఇచ్చే తీర్పులు విదేశీ కోర్టులు ఇచ్చినట్టుగానే పీవోకేలో కనిపిస్తాయని తెలిపారు. దీనిపై జస్టిస్ మొహ్సిన్ అఖ్తర్ కయానీ స్పందిస్తూ... పీవోకే విదేశీ భూభాగం అయితే పాకిస్థానీ మిలిటరీ, రేంజర్లు ఆ భూభాగంలోకి ఎలా అడుగుపెట్టారని ప్రశ్నించారు.

నాగ్‌పూర్, ఢిల్లీ ఉష్ణోగ్రతలు తప్పు

- సెన్సార్‌లలో లోపాలు ఉన్నాయి
- వెల్లడించిన వాతావరణ విభాగం

ఢిల్లీ, జూన్ 1: దేశంలో ఎండలు మండిపోతున్నాయి. అన్ని రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. అయితే, ఇటీవల ఢిల్లీ, నాగ్‌పూర్‌లో మాత్రం అసాధారణ రీతిలో ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. మే 29న ఢిల్లీలోని మంగేశ్‌పూర్‌లో ఏకంగా 52.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఇది దేశచరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రతగా అంతా భావించారు. అయితే, మరునాడే ఈ రికార్డును బ్రేక్ చేస్తూ గురువారం నాగ్‌పూర్‌లోని అంబాజరీ రోడ్డులో 56 డిగ్రీలు, సోనేగావ్‌లో 54 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఇలా అసాధారణ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడాన్ని వాతావరణ విభాగం సైతం అనుమానించి విచారణ జరిపింది. సెన్సార్‌లలో లోపాల వల్లనే ఇలా అధిక ఉష్ణోగ్రతలు రికార్డయినట్టు గుర్తించింది. నాగ్‌పూర్‌లో నాలుగు ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లను ఏర్పాటు చేయగా సోనేగావ్, అంబాజరీ రోడ్డులో అసాధారణ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని, మిగతా రెండు స్టేషన్లలో మాత్రం 44 డిగ్రీలు నమోదైనట్టు భారత వాతావరణ విభాగం వెల్లడించింది. రెండు కేంద్రాల్లో సెన్సార్ సరిగ్గా పని చేయకపోవడం వల్లనే తప్పుగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని తెలిపింది. మరో వైపు ఢిల్లీలోని మంగేశ్‌పూర్‌లో కూడా 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత తప్పుగా నమోదైందని కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు తెలిపారు. సెన్సార్ లోపం వల్ల 3 డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రత రికార్డయినట్టు వెల్లడించారు.



వాట్సాప్‌లో ట్రేడింగ్ పేరుతో టోకరా

9 కోట్లు పోగొట్టుకున్న వ్యాపారవేత్త

నోయిడా, జూన్ 1: సైబర్ నేరగాళ్ల వలలో పడి నోయిడాకు చెందిన ఒక వ్యాపారి 9 కోట్లను పోగొట్టుకున్నాడు. నోయిడాలోని 40వ సెక్టార్‌లో నివసించే వ్యాపారవేత్త రజత్ బాత్రాను కొందరు సైబర్ నేరగాళ్లు తాము వాట్సాప్ గ్రూప్‌లో పంపిన లింక్‌లతో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని ఆశపెట్టారు.. దీంతో అతడు మే 27 వరకు 9.09 కోట్లను పెట్టుబడి పెట్టాడు. అయితే డబ్బులు డ్రా చేయడానికి ప్రయత్నించగా, అవి విత్‌డ్రా అవ్వకపోగా అతని ఖాతాను మూసేశారు. దీంతో మోసపోయానని తెలుసుకుని పోలీసులను ఆశ్రయించగా, సైబర్ నేరాగాళ్లు అతని ఖాతా బదిలీ కావాల్సిన 1.62 కోట్లను స్తంభింపజేశారు.

పుణే పోర్షే కేసు.. మైనర్ బాలుని తల్లి అరెస్ట్

పుణే: పోర్షే కారును విచక్షణారహితంగా నడిపి, ఇద్దరు టెకీల ప్రాణాలను బలి తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మైనర్ బాలుని తల్లిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీస్ కమిషనర్ అమితేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, ఆ మైనర్ బాలుని రక్త నమూనాలను ఆమె రక్త నమూనాలతో మార్చినట్లు నిర్ధారణ కావడంతో ఆమెను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం జువైనల్ హోంలో అబ్జర్వేషన్‌లో ఉన్న మైనర్‌ను అతని తల్లి సమక్షంలో దాదాపు ఓ గంటసేపు పోలీసులు విచారించారు.

సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఖజన్ సింగ్ డిస్మిస్

న్యూఢిల్లీ: సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఖజన్ సింగ్‌ను కేంద్ర ప్రభుత్వం సర్వీస్ నుంచి డిస్మిస్ చేసింది. మహిళా సిబ్బంది ఆయనపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం మే 30న ఆదేశాలు జారీ చేసినట్టు సీఆర్‌పీఎఫ్ అధికారులు తెలిపారు.